క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కిరణ్

ఎటపాక: గొల్లగుప్ప గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. గొల్లగుప్ప వలస ఆదివాసీ గ్రామంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనం పనులు పూర్తి చేయాలని, బండిరేవు నుంచి గొల్లగుప్ప వరకు రోడ్డు నిర్మించాలన్నారు. నాయకులు నాగేశ్వరరావు, అజయ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

గోతుల్లో పడి మూగజీవాల మృత్యువాత



అసరాడలో గోతిలో పడి మరణించిన ఆవు

గూడెంకొత్తవీధి: ఇటీవల కాలంలో మండలంలోని పలు గ్రామాల్లో మూగజీవాలు గోతుల్లో పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. అసరాడ గ్రామంలో ఫైబర్ నెట్ కోసం తీసిన గోతిలో పడి ఒక ఆవు చనిపోయింది. తాజాగా శుక్రవారం కొత్తపాకలు గ్రామానికి చెందిన ఆవు ఒకటి మండల కేంద్రంలో ఒకరి ఇంటి వెనుక మరుగుదొడ్డి కోసం నిర్మించిన గోతిలో పడి చనిపోయింది. గూడెం గ్రామంలో మరొకరి ఇంటి వెనుక గోతిలో మరో ఆవు పడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంది. గోతుల్లో పడి మూగజీవాలు ప్రాణాలను కోల్పోతుండడంతో గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్, హెచ్‌సీ ఆర్‌కే

దుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ గొందిగుడ గ్రామంలో ఎస్‌ఐ సంతోష్ కుమార్ శుక్రవారం సందర్శించి, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసానికి కలుగుతుందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ యువకులకు వాలీబాల్ కిట్లు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ ఆర్‌కే తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏపీవోగా సుజాతకు బాధ్యతలు

చింతూరు: చింతూరు ఐటీడీఏ ఏపీవోగా కూనవరం ఏటీడబ్ల్యువో సుజాతకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే శుక్రవారం ఆదేశాలు జారీచేసారు. గతంలో ఇక్కడ ఏపీవోగా పనిచేసిన సూర్యనారాయణ మన్యం జిల్లా పార్వతీపురం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో ఏపీవో పోస్టు ఖాళీగావుంది. దీంతో ఏటీడబ్ల్యువో సుజాతకు ఏపీవోగా బాధ్యతలు అప్పగిస్తూ పీవో ఆదేశాలు జారీ చేశారు.

గిరిజన ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశం నేడు

పాడేరు రూరల్: పట్టణంలోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గిరిజన ఉద్యోగ సంఘాల జేఏసీ అత్యవసర సమావేశం శనివారం ఏర్పాటు చేసినట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నీలకంఠం, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పలు అక్రమాలు జరుగుతుందనే దుష్ప్రచారంపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం, గిరిజన ఉద్యోగుల సంఘం, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం, ప్రధానోపాధ్యాయుల సంఘం, వసతి గృహాల సంక్షేమ సంరక్షుల సంఘం ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు

- గూడెం కొత్తవీధి, అరకులోయ, రాజవొమ్మంగిలలో 'గడప గడప'లో పాల్గొన్న ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి



పెదవలసలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను గ్రామస్తులకు అందిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



మాదలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



జి.కొత్తపల్లిలో గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గూడెంకొత్తవీధి: పేదల చెంతకే అన్ని రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గూడెంకొత్తవీధి మండలం పెదవలస సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. పెదవలస సచివాలయ పరిధిలోని రంపుల, చాపరాతిపాలెం, డొకులూరు, కొక్కితపాడు, బందవీధి, పెదలంక గ్రామాల్లో 350 గడపలను ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరికీ పథకాలను అందించిన ఘనత మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే నన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. గూడెంకొత్తవీధి, కొయ్యూరు ఎంపీపీలు బోయిన కుమారి, రమేష్, జెడ్పీటీసీ శివరత్నం, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ రాజులమ్మ, మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్, జల్లిబాబు, సర్పంచ్ కృష్ణవంశీ, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, తాగునీటి సరఫరా విభాగం జేఈ భగవంతరావు, మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు, ఇన్‌చార్జి గృహనిర్మాణశాఖ ఏఈ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: అని వర్గాల ప్రజలకు ఇంటింటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో మాదల పంచాయతీ పరిధిలో గల తోటవలస, మజ్జివలస, మాదల, బొర్రిగూడ గ్రామల్లో శుక్రవారం ఆయన పార్టీ శ్రేణులు,అధికారులతో పర్యటించారు, గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాలోల 256 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతు ప్రతి అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధర్‌స్వామి, ఎంపీపీ ఉషారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్, రాజారమేష్ పీఏసిఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినకుమార్, ఎంపీటీసీ సభ్యులు రాంచందర్, శత్రుగున్, సర్పంచ్‌లు శ్రీనివాస్, రాధిక, నాయకులు సన్యాసి, గురుమూర్తి, రఘునాథ్, సంపత్‌కుమార్, గోపాల్, శివాజీ పాల్గొన్నారు.

సుపరిపాలనే సీఎం జగనన్న లక్ష్యం: రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: రాష్ట్రంలో అన్ని వర్గాలకు పారదర్శకంగా పథకాలు అమలుచేస్తూ సుపరిపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. రాజవొమ్మంగి మండలంలోని లోతట్టు ప్రాంతం వంచంగి పంచాయతీలోని జి.కొత్తపల్లి, వంచంగి, బలిజపాడు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 275 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించారు.ఎమ్మెల్యేకు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

ప్రతి సచివాలయానికి మంజూరు చేస్తున్న నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. శాశ్వత గృహ నిర్మాణాలకు కూడా దశలవారీగా నిధులు మంజూరు చేస్తామన్నారు. వర్షాలు కురిసినపుడు జి.కొత్తపల్లి కొండపై వరద నీరు గ్రామాన్ని ముంచెత్తుతుందని సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే ధనలక్ష్మికి విన్నవించారు.

స్పందించిన ఎమ్మెల్యే ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన డ్రైనేజిల నిర్మాణం చేపడతామన హామీ ఇచ్చారు. జి.కొత్తపల్లిలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. స్థానికులు వెల్లడించిన పలు సమస్యలపై ఆమె సానుకూలంగా స్పందించారు. త్వరలో పరిష్కరిస్తామన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, సర్పంచ్ కాంతం, ఎంపీటీసీ సభ్యురాలు చిన్నాలమ్మ, వైస్ సర్పంచ్ పద్మావతి, ఎంపీడీవో బాపన్నదొర, విద్యుత్ శాఖ ఏఈ సురేష్‌కుమార్, హౌసింగ్ ఏఈ చలపతి, వాతంగి సర్పంచ్ శుభలక్ష్మి, మాజీ సర్పంచ్ జాన్‌బాబు, చెరకుంపాలెం సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు, కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఎంపీడీవోల తనిఖీలు



చామగడ్డలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో అశోక్‌కుమార్



సంకాడ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం, చామగడ్డ గ్రామ సచివాలయాలను శుక్ర వారం ఎంపీడీఓ అశోక్‌కుమార్ సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయంలో పెండింగులో ఉన్న ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలిచ్చారు. ఏపీవో ప్రకాశ్‌బాబు, సచివాలయాల సిబ్బంది ఉన్నారు.

గూడెంకొత్తవీధి: సంకాడ సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

బీమాతో ఆర్థిక ఆసరా



లబ్ధిదారునికి పత్రాలు అందజేస్తున్న మేనేజరు కనకారావు

కూనవరం: ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం లబ్ధిదారైన సున్నం సీతమ్మ భర్తకు శుక్రవారం రూ. రెండు లక్షలు నగదుకు సంబంధించిన పత్రాలను ఎస్‌బీఐ టేకులబోరు బ్రాంచి మేనేజర్ కనకారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటూరు గ్రామానికి చెందిన సున్నం సీతమ్మ పీఎంజేజేబీవై బీమా పథకంలో సభ్యత్వం పొందినట్టు తెలిపారు. ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతి చెందగా నామినిగా ఉన్న ఆమె భర్త లక్ష్మయ్యకు నగదు పత్రాలను అందజేసినట్టు చెప్పారు. బీమా పథకాలు కుటుంబాలకు ఆర్థిక ఆసరాగా నిలుస్తోందన్నారు.

పోస్టల్ సేవలపై విస్తృత ప్రచారం



అవగాహన కల్పిస్తున్న ప్రసాద్‌బాబు, ఉపేంద్ర

అరకులోయ రూరల్: స్థానిక పోస్టల్ శాఖ కార్యాలయం ఆవరణలో అరకు సబ్ డివిజన్ పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర ఆధ్వర్యంలో పోస్టల్ శాఖ సేవలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనకాపల్లి డివిజన్ పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖ అందిస్తున్న జీవిత బీమా, పొదుపు వివిధ పథకాలపై గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి ఒక్కరూ పోస్టల్ శాఖ సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈ మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. పోస్టల్ శాఖ పాలసీలను ప్రతి ఒక్కరూ లబ్ధి పొందే విధంగా కృషి చేయాలన్నారు. పోస్టల్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు రూరల్ : తపాలశాఖలో కేవలం రూ.399లకే రూ.10లక్షల బీమా సదుపాయం కల్పిస్తున్నట్టు అనకాపల్లి తపాల శాఖ సూపరింటెండెంట్ జె. ప్రసాద్‌బాబు తెలిపారు. పాడేరు తపాలశాఖ కార్యాలయం ఆవరణలో బీమా పాలసీ మేళా కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలశాఖ టాటా ఏఐజీతో కలిసి తమ కస్టమర్ల కోసం జీవిత బీమా, ఆరోగ్య బీమా తరహాలో ప్రమాదబీమా పాలసీను తీసుకొచ్చిందన్నారు. 18 ఏళ్ల నుంచి 65 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు ఈ బీమా పాలసీను తీసుకోవచ్చన్నారు. ఈ బీమా పాలసీ తీసుకోవాలలంటే పోస్టల్ పేమెంట్ బ్యాంకులో తప్పనిసరిగా ఖాతా ఉండాలన్నారు. పాలసీ తీసుకున్న తర్వాత ఏదైన ప్రమాదంలో మరణించిన, శాశ్వత వైకల్యం ఏర్పడిన, అవయవం కోల్పోయిన, పక్షవాతం వచ్చిన రూ.10లక్షలు చెల్లిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మురళి, పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల సబ్ పోస్ట్ ఆఫీస్ మాస్టర్లు గిరిష్‌కుమార్, ఈశ్వర్‌రావు, రామకృష్ణ, బ్రాంచి పోస్ట్‌మాస్టర్లు నీలకంఠేశ్వరరావు, అప్పారావు, రాజేష్, శ్రీను, మహేశ్వరరావు పాల్గొన్నారు.

వెతలు తీరేనా?



రాజవొమ్మంగిలోని వట్టిగెడ్డ రిజర్వాయర్

- పంటకాలువకు గండ్లు
- సాగునీటికి ఆటంకం
- వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు పూర్తికాని మరమ్మతులు



వట్టిగెడ్డ రిజర్వాయర్ పంట కాలువ గండిని పూడ్చుతున్న రైతులు

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి శివారు అప్పలరాజుపేట అటవీ ప్రాంతంలో గల దాదాపు 50 ఏళ్ల చరిత్ర గల వట్టిగెడ్డ రిజర్వాయర్ దాదాపు 2 దశాబ్దాలుగా మరమ్మతుకు నోచుకోలేదు. దీంతో 5 కిలోమీటర్ల నిడివిగల పంటకాలువ గట్లు కుంగిపోయి ఆయకట్టు శివారు భూములను సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఎక్కడికక్కడ గండ్లు పడి సాగునీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఈ రిజర్వాయర్‌కు గల 200 ఎకరాల చెరువుగర్భం నిత్యం నీటితో నిండి నిండుకుండను తలపిస్తోంది. అయితే సాగునీటి వనరుకు సక్రమమైన పంట కాలువ లేకపోవడంతో రైతుల పాలిట శాపంగా పరిణమించింది. రిజర్వాయర్ ప్రధాన స్లూయిజ్ నుంచి దాదాపు 200 మీటర్ల పొడవున పంటకాలువ ఎడమకాలువ గట్టు అధిక వర్షాలకు కుంగిపోయింది. ఈ పంట కాలువకు గతంలో నిర్మించిన రాతి రివిట్‌మెంట్ పాడయ్యింది. అదే విధంగా ఎడమగట్టుకు గతంలో నిర్మించిన దాదాపు 200 మీటర్ల పొడవు గల రిటైనింగ్ వాల్ కూడా నామరూపాలు లేకుండా పోయింది. దీంతో ఈ పంట కాలువకు పెద్ద పెద్ద గండ్లు ఏర్పడ్డాయి. ఈ గండ్ల ద్వారా సాగునీరు దిగువకు వృథాగా పోతోంది. మరోవైపు అడ్డు అదుపు లేకుండా పోతున్న నీటి వల్ల పల్లపు ప్రాంతాలు ముంపుకు గురై ఏ పంట వేయాలన్నా ఉపయోగం లేకుండా పోతోందని అప్పలరాజుపేటకు చెందిన గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగునీటి వనరులను పర్యవేక్షించాల్సిన అధికారులు అందుబాటులో ఉండడం లేదని రైతులు చెబుతున్నారు. ఇకనైనా మండలంలోని ఐదు గ్రామాలకు సాగునీరు అందించే కల్పతరువు వంటి వట్టిగెడ్డ రిర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలని, పంటకాలువను పటిష్ఠ పరచాలని రైతులు కోరుతున్నారు.ఈ అంశంపై ఇటీవల రంపచోడవరం డివిజన్‌కు అడిషన్ ఇన్‌చార్జ్ స్వీకరించిన ఎంఐ. ఈఈ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా ఏఈ తదితర తమ సిబ్బందిని వట్టిగెడ్డ రిజర్వాయర్‌కు పంపించి పంట కాలువకు చేపట్టాల్సిన పనులకు ఎస్టిమేషన్లు రూపొందిస్తామన్నారు. నివేదికను ఐటీడీఏ పీఓకు అందజేస్తామన్నారు.

వచ్చే నెల 11న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జడ్జి ఉమాదేవి

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల పోలీసు అధికారులు, న్యాయవాదులతో అరకులోయ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి ఉమాదేవి శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కేసులు పరిష్కరించేందుకు లోక్ అదాలత్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని, వివిధ కేసులు పరిష్కరించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. న్యాయవాదులు మురళీమోహన్, రత్నరాజు, రాంబాబు, ప్రభాకర్, సింహాచలం , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటింటికీ వైద్య సేవలు



దుశ్చర్తిలో వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

అడ్డతీగల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజల ముంగిట్లోకి వైద్య సేవలు అందుబాటులోనికి తీసుకొచ్చింది, సద్వినియోగం చేసుకోవాలని దుప్పులపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి షమా అన్నారు. అడ్డతీగల మండలం దుశ్చర్తిలో శుక్రవారం 104 వాహన వైద్యుడు పి.నాగేశ్వరరావుతో కలిసి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. 68 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. అనారోగ్య పరిస్థితులు దరిచేరకుండా పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలని సూచించారు.ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తినప్పుడు అందుబాటులోని వైద్యులను సంప్రదించి తక్షణమే చికిత్స పొందాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి రజని, ఏఎన్‌ఎం రామలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొని సేవలందించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రాజవొమ్మంగి: ముర్లవానిపాలెం గ్రామానికి చెందిన మల్లేసు అనే వ్యక్తి శుక్రవారం రాత్రి పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ తగాదాలే ఇందుకు కారణమని తెలిసింది. పొలానికి వెళ్లి పురుగుమందు సేవించి అపస్మారకస్థితికి చేరుకున్న మల్లేసును కుటుంబసభ్యులు 108లో స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. చికిత్స పొందుతున్నాడు.

గ్రామాల్లో 23న 'గడప గడపకు'

అడ్డతీగల: అడ్డతీగల మండలంలోని డి.భీమవరం, నూకరాయి, కోవెలపాలెం గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఘనంగా గొట్టి పండగ

పాడేరు రూరల్ : పట్టణంలోని సుండ్రుపుట్టు వీధిలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దన్నేటిపలాసి రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం గొట్టి పండుగను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ ముగిసిన తరువాత ఈ పండుగ నిర్వహించడం గిరిజనులకు అనవాయితీ. సుమారు శుక్రవారం గ్రామ శివారులోని పంట పొలాల వద్ద గిరిజన రైతులు, గ్రామ పెద్దలు, మహిళలంతా ఇంటిల్లాపాధి వంటలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేసి సందడి చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి, ఇతర పంటలు సాగుపై చర్చించుకున్నారు. జెన్నీలో సంక్రాంతి పండగ తరువాత అన్ని గ్రామాల్లో ప్రత్యేక సంక్రాంతి సంబరాలు జరుపుకుంటారు. ఇందులో భాగంగా గ్రామాల్లో బుడియాల సందడి చేస్తారు. చిన్నారులు, యువత ప్రత్యేక వేషధారణలో అలరిస్తారు. నగదు, నిత్యావసరాలు సేకరిస్తారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

వైఎస్సార్ ఉద్యాన యూనివర్శిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ

రంపచోడవరం: ఏజెన్సీలోని గిరిజన మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ ఈ కరుణశ్రీ అన్నారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, హైదరాబాద్ ఆర్థిక సహాయంతో చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో అనేక జలాశయాలు ఉన్నాయని వాటి ద్వారా లభ్యమయ్యే చేపలు ,రొయ్యలతో పచ్చళ్లు, అప్పడాలు, కట్‌లెట్స్ తదితర ఆహార ఉత్పత్తులు తయారు చేసి విక్రయించుకోవచ్చన్నారు. గిరిజన మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యశాఖ శాస్త్రవేత్త కెవీకె (వెంకటరామన్నగూడెం) డాక్టర్. ఎ.దేవివరప్రసాద్‌రెడ్డి చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత పదార్ధాల తయారీలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలపై పవర్ పాయింట్ ద్వారా వివరించారు. కెవీకె శాస్త్రవేత్త వీరాంజనేయులు, డాక్టర్, లలితకామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.